సాక్షి తిరుపతి
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు
జిల్లాలోని చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. - 9లో



ప్రాణాలు కాపాడిన ఎయిర్ బ్యాగ్
తిరుపతి– చెన్నై హైవేపై బుధవారం జరిగిన ప్రమాదంలో రెండు ప్రాణాలను ఎయిర్ బ్యాగ్ కాపాడింది. - 9లో



యువకుడి దారుణ హత్య
గూడూరు పట్టణంలోని టిడ్కో ఇళ్లకు చెందిన రహీద్ అనే కారు డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. - 9లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 70,828 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,296 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.07 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 19 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం 69వ ఉమ్మడి చిత్తూరు జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. జిల్లాస్థాయి క్రీడాకారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు తీగల వెంకటయ్య, ఎంఈఓలు బాలయ్య, భువనేశ్వరమ్మ, కిషోర్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో ఉద్యోగాలు

- 19 వరకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : ఐసీడీఎస్ పరిధిలోని మిషన్ వాత్సల్య స్కీమ్‌కు సంబంధించి డీసీపీయూ,ఎస్ఏఏ యూనిట్ పరిధిలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీడీ వసంతబాయి బుధవారం తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తులను పోస్టల్ ద్వారా లేదా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో నేరుగా సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.7,944 నుంచి రూ.10వేల వరకు నెలవారీ వేతనం ఉంటుందని వివరించారు. ఓసీ అభ్యర్థులు దరఖాస్తు ఫీజు కింద రూ.250, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.200 చెల్లించాలని తెలిపారు. తిరుపతి.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శుల నియామకం

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులను నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. ఈ మేరకు జిల్లాకు చెందిన కేతం జయచంద్రారెడ్డి(తిరుపతి), ఆరె. అజయ్‌కుమార్(తిరుపతి), కేవీ భాస్కర్‌నాయుడు(సత్యవేడు), టి. హరిచంద్రన్ (సత్యవేడు), కేవీ నిరంజన్‌రెడ్డి(సత్యవేడు)ని నియమిస్తున్నట్లు పేర్కొంది.

రేపటి నుంచి జాతీయ స్థాయి నృత్య పోటీలు



మాట్లాడుతున్న గుండాల గోపీనాథ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : రాయలసీమ రంగస్థలి స్వర్ణోత్సవాల్లో భాగంగా నేటి నుంచి మహతి కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు జాతీయ స్థాయి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, గౌరవ సలహాదారు కీర్తి వెంకయ్య తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఈ క్రమంలోనే నాట్య గురువులు, నృత్య కళాపోషకులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రంగస్థలి కార్యదర్శి కేఎన్.రాజా, కళాకారులు జీజీరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మస్తాన్, రవి ప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిమాన్వితం.. మహోరూపం

నేత్రాలను అమర్చక ముందు అమ్మవారి ప్రతిమ



- వైభవంగా ప్రారంభమైన వెంకటగిరి పోలేరమ్మ జాతర
- వేప మండల నడుమ చలువ పందిరిలో కొలువుదీరిన అమ్మవారు
- గ్రామదేవత దర్శనానికి పోటెత్తిన భక్తులు
- నేడు నగరోత్సవం.. నిమజ్జనం

కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలు.. జనంతో కిక్కిరిసిన వీధులు.. తప్పెట్లు.. తాళాలు.. కనులపండువగా కళాకారుల ప్రదర్శనలు.. బాణసంచా పేలుళ్లు.. ఉత్సాహంగా కదంతొక్కిన యువత నృత్యాల నడుమ పోలేరమ్మ జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. దేశవిదేశాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులతో వెంకటగిరిలోని ప్రతి ఇల్లూ కళకళలాడుతోంది. శక్తిస్వరూపిణి మహిమాన్విత మహోరూపం వీక్షించేందుకు అశేష భక్త వాహిని బారులు తీరింది. పుట్టింటి నుంచి కదలిన అమ్మవారిని మనసారా సేవించుకుని పులకించింది. వేప మండల నడుమ చలువ పందిరిలో కొలువుదీరిన గ్రామదేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంది.

పోలేరమ్మ ఆలయంలో పుష్పాలంకరణ (ఇన్‌సెట్) విద్యుద్దీపకాంతులీనుతున్న అమ్మవారి ఆలయం



వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తల్లి దీవెనల కోసం పట్టణం భక్తజనసంద్రంగా మారింది. ఇసుకేస్తే రాలనంతగా ప్రజలు తరలివచ్చారు. జిల్లా నుంచే కాకుండా దేశవిదేశాల నుంచి వెంకటగిరీయులు స్వగృహాలకు చేరుకున్నారు.

వైభవంగా రథోత్సవం

కుమ్మరివీధిలోని అమ్మవారి పుట్టింటిలో పోలేరమ్మ ప్రతిమను తయారు చేశారు. విగ్రహానికి నేత్రాలను అమర్చకుండా బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో కొలువుదీర్చారు. అమ్మవారి ప్రతిమను తయారు చేసిన వెంటనే దర్శించుకుంటే మంచి జరుగుతుందనే నమ్మకంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అత్యంత భక్తిశ్రద్ధలతో పోలేరమ్మను సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారిని రథంపై కొలువుదీర్చి జీనిగలవారి వీధికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అశేష భక్తజనం నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. అక్కడ పోలేరమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి సంపరదాయబద్ధంగా గాలి గంగులకు పూజలు నిర్వహించారు. అనంతరం బలి కార్యక్రమం ముగిసిన తర్వాత అమ్మవారికి కళ్లు అమర్చారు. బుగ్గ చుక్కను తీర్చిదిద్దారు. దివ్యతేజస్సుతో అలరారుతున్న పోలేరమ్మ దివ్యరూపాన్ని రథంపై ఊరేగిస్తూ.. పాతకోట మీదుగా అమ్మవారి ఆలయానికి చేర్చారు. అక్కడ వేప మండలతో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో మహిమాన్విత ప్రతిమను ప్రతిష్ఠించారు. గురువారం వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శనానికి పోటెత్తారు.

నేడు నిమ్మమణం

జాతరలో భాగంగా గురువారం అమ్మవారి నిలుపు కార్యక్రమం మొదలవుతుంది. పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక మండపంలో అమ్మవారు కొలువుదీరుతారు. సాయంత్రం వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వైభవంగా పోలేరమ్మ నగరోత్సవం నిర్వహిస్తారు. విరూపమండపం వద్ద అమ్మవారి నిమ్మమణ కార్యక్రమం పూర్తి చేస్తారు. దీంతో జాతర ఘట్టం పరిపూర్ణమవుతుంది.



అమ్మవారి సేవలో భక్తులు

వేడుకగా మడి భిక్షాలు



జాతర సందర్భంగా వెంకటగిరిలోని ప్రతి వీధి కళకళలాడుతోంది. పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి అంటూ భక్తుల నినాదాలు హోరెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే పట్టణంలోని ప్రతి ఇంట్లో పసుపుతో అమ్మవారి ప్రతిమను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబలిని నైవేద్యంగా సమర్పించారు.

మెట్టినింటికి అమ్మవారు

వెంకటగిరి రూరల్: జాతరలో భాగంగా పోలేరమ్మ తల్లిని బుధవారం అర్ధరాత్రి పుట్టినిల్లు అయిన కుమ్మరివారి ఇంటి నుంచి మెట్టినిళ్లు అయిన జీనుగుల వారివీధిలోని చాకలి మండపానికి భక్తి శ్రద్ధలతో చేర్చారు. చాకలి మండపం వద్ద కొలువైన అమ్మవారికి కళ్లు, దిష్టిచుక్క ఏర్పాటుచేసి కొలువుదీర్చారు. అనంతరం సంప్రదాయబద్ధంగా అమ్మవారిని ప్రత్యేక రథంపై అధిరోహింపజేశారు. భక్తజన సందోహం మధ్య తప్పెట్లు, తాళాలు, కీళారింపులతో అంగరంగ వైభవంగా అమ్మవారి దేవస్థానం వద్ద కొలువుదీర్చారు (నిలుపుచేశారు). అనంతరం అమ్మవారికి స్వర్ణ కిరీటం, స్వర్ణ ఆభరాణాలు అలంకరించి బద్దె గొర్రె పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు.

సులభతరంగా 'అమ్మ' దర్శనం



సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పోలేరమ్మతల్లిని భక్తులు సులభతరంగా దర్శించుకునేలా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో జాతర బందోబస్తుపై అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పోలేరమ్మ జాతరకు పకడ్బందీ బందోబస్తు కల్పించినట్లు వెల్లడించారు. సుమారు వెయ్యిమంది పోలీసులతో కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తుల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలని, నిమజ్జనం, ఊరేగింపులో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర పండుగ పోలేరమ్మతల్లి జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ క్రమంలోనే వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక కమాండ్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ గీతాకుమారి, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ ఏవీ రమణ పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యం

తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనార్థ తరలివచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన టీటీడీ ఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్నమయ్యభవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కేవలం 2వారాలే ఉన్నాయని, నిర్దేశిత గడువులోపు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత విస్తరించాలని కోరారు. ఆలయ పవిత్రతను కాపాడుకుంటూ భక్తులకు మరింతగా సేవలు అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు వెల్లడించారు. టీటీడీ చైర్మన్, బోర్డు సభ్యుల ఫీడ్ బ్యాక్‌తోపాటు డయల్‌యువర్ ఈఓ, ఐవీఆర్ఎస్, వాట్సాప్ ద్వారా భక్తుల అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. తక్షణం చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, దీర్ఘకాలికంగా చేపట్టనున్న పనులపై కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. విధానపరమైన నిర్ణయాలలో టీటీడీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు సమష్టిగా భాగస్వాములు కావాలన్నారు. అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ తిరుమలలో వసతి, అన్నప్రసాదాలు, డొనేషన్ తదితర శాఖలలో విధానపరమైన వ్యవస్థలను తీసుకువచ్చామని తెలిపారు. ఇతర శాఖల్లోనూ ఇదే విధానం ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జేఈఓ వి.వీరబ్రహ్మం మాట్లాడుతూ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తృతం చేస్తున్నట్లు వెల్లడించారు. టీటీడీ సీవీఎస్ఓ మురళీకృష్ణ మాట్లాడుతూ, అలిపిరి టోల్ గేట్ ఆధునికీకరణ చేపట్టినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగ సమావేశం



రాజేంద్ర, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు తిరుపతి పద్మావతీపురంలోని పార్టీ కార్యాలయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్సీ విభాగం నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. బుధవారం ఈ మేరకు పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర మీడియాతో మాట్లాడారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరవుతారని వివరించారు.

డేటా సైన్స్ సెంటర్ ప్రారంభం

తిరుపతి రూరల్ : మండలంలోని తుమ్మలగుంట పంచాయతీ నలందానగర్‌లో ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్‌పీఎస్) డేటా సైన్స్ సెంటర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ గణాంక వేత్త డాక్టర్ సీఆర్‌రావు 105వ జయంతి సందర్భంగా డేటా సైన్స్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆధునిక ప్రయోగశాల, డిజిటల్ క్లాస్ రూములు, లైబ్రరీ అందుబాటులో ఉంటాయి. గణాంక శాస్త్రం, మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగాలలో పరిశోధన, శిక్షణ ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా డేటా సెంటర్‌ను అభివృద్ధి చేసినట్లు వివరించారు. అనంతరం ఐఎస్ఐ మాజీ డైరెక్టర్ బీఎల్ఎస్ ప్రకాశరావు, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణలతో కలిసి సీఆర్‌రావు సెమినార్ హాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. సెల్ఫ్ స్టడీ లైబ్రరీ, రూఫ్ గార్డెన్‌ను సందర్శించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. డేటా సైన్స్ సెంటర్ విద్యార్థులకు, ప్రభుత్వ ప్రాజెక్టులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే ప్రొఫెసర్ సీఆర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు ఐఎస్‌పీఎస్ గౌరవ అధ్యక్షుడు పి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డేటా సైన్స్ సెంటర్ భవన నిర్మాణం, వసతులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారాలను వివరించారు. ఐఎస్‌పీఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పీజీ శంకరన్, ప్రొఫెసర్ ఆర్ఎల్ షిండే, ప్రొఫెసర్ సోమేష్‌కుమార్ పాల్గొన్నారు.



డేటా సైన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పడిగాపుల ప్రయాణం

- బాబు సభకు బస్సులు
- బస్టాండుల్లో ప్రజలకు తప్పని తిప్పలు

తిరుపతి అర్బన్ : ప్రజల అవస్థలను కూటమి ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాలను అరకొరగా అమలు చేస్తూ లబ్ధిదారులను నిరాశకు గురిచేస్తోంది. అక్కడితో ఆగకుండా తమ సూపర్ సిక్స్ పథకాలన్నీ సూపర్ హిట్ అంటూ డబ్బా కొట్టుకుంటోంది. పోనీలే అనుకుంటూ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న ప్రజలను వివిధ రూపాల్లో ఇబ్బంది పెట్టేందుకు యత్నిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం అనంతపురంలో నిర్వహిస్తున్న చంద్రబాబు సభకు జిల్లాను 364 బస్సులను తరలించేసింది. దీంతో రెండు రోజులుగా జిల్లావాసులు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బాబుగారి సేవకు ఆర్టీసీ బస్సులు వెళ్లిపోవడంతో రాకపోకలకు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో వందలాది మంది ప్రయాణికులు పడిగాపులు కాశారు. గంటకో.. రెండు గంటలకో ఓ బస్సు రావడంతో ఎక్కేందుకు పోటీపడుతున్నారు. సీటు సంగతి దేముడెరుగు, నిలబడేందుకు చోటు దొరికితే చాలు అనుకుంటూ బస్సు పైకి ఎగ బడుతున్నారు. ముఖ్యమంత్రి సభకు ఇక్కడ నుంచి బస్సులను తరలించడమేంటని మండిపడుతున్నారు. దీనిపై ముందస్తుగా ప్రకటన విడుదల చేసుంటే, తమ ప్రయాణం వాయిదా అయినా వేసుకునే వాళ్లమని వాపోతున్నారు. అయితే గురువారం ఆర్టీసీ బస్సులు తిరిగి వస్తాయని అధికారులు వెల్లడిస్తున్నారు.



తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు




ఎప్పుడు వస్తాయో.. ఏమో..?



రాక రాక వచ్చిన బస్సులోకి తొక్కుకుంటూ.. తోసుకుంటూ..



కోరిన కోర్కెలు తీర్చే తల్లి పోలేరమ్మ


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి(ఫైల్), అమ్మవారి ప్రతిమను నెత్తిన పెట్టుకుని సంచరిస్తున్న మహిళ, వెంకటగిరిలో కొలువై ఉన్న అమ్మవారు

వెంకటగిరి(సైదాపురం): కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పోలేరమ్మ ప్రజల ఆదరణ పొందుతోంది. పోలేరమ్మ తల్లిని జాతరలో దర్శించుకుంటే సుఖసంతోషాలతో ఉంటామని ఇక్కడి ప్రజల నమ్మకం. ప్రజల్లో నేటికీ ఆ నమ్మకం నాటుకుపోయింది. బంధువులు, అనుబంధాల కలయికకు అరుదైన వేదిక వెంకటగిరి జాతర నిలుస్తోంది. అంతరించిపోతున్న జానపద కళారూపాలు ప్రదర్శించే అవకాశం వెంకటగిరి జాతరలోనే ఉంది. జాతర 1714లో ప్రారంభమైనట్లు ఓ కథ ప్రచారంలో ఉంది. 1919లో వెంకటగిరి రాజాలు గ్రామశక్తి పోలేరమ్మ జాతరను వైభవంగా నిర్వహించారని పెద్దలు చెబుతున్నారు. అదే సంవత్సరంలో కలరా వ్యాపించి పలువురు మృత్యువాత పడ్డారు. దీంతో అప్పటి నుంచి రాజాలు గ్రామ పొలిమేరల్లో గ్రామశక్తి శిలలను ఏర్పాటు చేయించి అనంతరం పోలేరమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. అప్పటి నుంచి నేటి వరకు రాజాల అనుమతితోనే జన జాతరను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ.

శీతలయాగంలో జాతర మొదలు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లి కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల ఆదరణ పొందుతోంది. వందేళ్ల క్రితం వెంకటగిరి ప్రాంతాన్ని సంస్థాన రాజులు ఏలుతున్న రోజుల్లో పట్టణంలో కలరా మహమ్మారి ఎంతో మందిని బలి తీసుకుంది. ఆ సమయంలో వెంకటగిరి సంస్థాన దీశులు భారీఎత్తున శీతల యాగం నిర్వహించారు. పోలేరమ్మ విగ్రహాన్ని రాజాప్యాలెస్‌కు సమీపంలో నిర్మించి జాతరను వైభవంగా నిర్వహించారు. రాజాల పర్యవేక్షణలో జరుగుతూ వస్తున్న పోలేరమ్మ జాతర 1992 నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వెంకటగిరి పోలేరమ్మకు వెంకటగిరి రాజాలు పట్టు వస్త్రాలు సమర్పించే పద్ధతి నేటికీ కొనసాగుతోంది.

పుష్పాలంకరణలో శోభాయమానంగా ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయం








విద్యుత్ కాంతులతో ఎగ్జిబిషన్‌లోని జెయింట్‌వీల్, విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్న అమ్మవారి రూపాల్లో ప్రత్యేక సెట్టింగులు




విద్యుత్ కాంతులతో ఎగ్జిబిషన్‌లోని జెయింట్‌వీల్, విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్న అమ్మవారి రూపాల్లో ప్రత్యేక సెట్టింగులు

భక్తి శ్రద్ధలతో మడిభిక్షాలు



అమ్మవారి అంబలి పంపిణీ చేస్తున్న భక్తులు



మడిభిక్షాలతో పూజలు చేస్తున్న ప్రజలు

వెంకటగిరి రూరల్ : పోలేరమ్మతల్లి జాతరలో భాగంగా బుధవారం మడిబిక్షాలు పట్టణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా వేపాకు తోరణాలతో ఆసాదుల తప్పెట్ల తాళాలమధ్య మడిభిక్షాటన నిర్వహించారు. పోలేరమ్మకు బిచ్చం పెట్టండి. పోతురాజుకు కొబ్బరికాయ కొట్టండి. పగలకపోతే నా నెత్తిన కొట్టండి అంటూ నినాదాలతో పట్టణ ప్రజలు ఇంటింటా తిరుగుతూ సందడి చేశారు. మరోపక్క అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన అంబలి, నైవేద్యంగా సమర్పించి పట్టణంలో ఎక్కడ చూసినా అమ్మవారి అంబలి పంపిణీ విరివిగా నిర్వహించారు.



నేదురుమల్లి చొరవతో జాతరకు ఖ్యాతి




నేదురుమల్లి సొంత నిధులతో నిర్మించిన పోలేరమ్మతల్లి ఆర్చి , జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం): నేదురుమల్లి చొరవతో వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. అమ్మవారి జాతరకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. మహిమ గల అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా చేయాలని దివంగత ముఖ్యమంత్రి జనార్దన్‌రెడ్డి చిరకాల స్వప్నం. అటువంటి కలను ఆయన తనయుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో నెరవేర్చారు. గతంలో రాజాల ఆ.దీనంలోనే జాతర నిర్వహణ కొనసాగుతూ వచ్చేది. అమ్మవారి జాతర విశిష్టత నలుమూలలకు వ్యాప్తి చెందే దిశగా అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 1991లో అమ్మవారి జాతరను దేవదాయశాఖకు అనుసంధానం చేశారు. అప్పటినుంచి నేటివరకు అమ్మవారి జాతర దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అమ్మవారి గుడి బజారువీధిలో చిన్నదిగా ఉండడం, ప్రముఖులకు అమ్మవారి గుడి తెలియజేసేందుకు సొంత నిధులతో మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి హయాంలో పోలేరమ్మతల్లి ఆర్చిని ఏర్పాటు చేశారు. అదే దిశగా వెంకటగిరీయుల చిరకాల స్వప్నమైన వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తింపు తెచ్చేందుకు నేదురుమల్లి వారసుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సహకారంతో వెంకటగిరికి విచ్చేసిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారు. దీంతో అమ్మవారి జాతర ఖ్యాతి హద్దులు దాటింది. పోలేరమ్మ జాతరకు ప్రత్యేక కీర్తి ప్రతిష్టలు తేవడంతో నేదురుమల్లి కుటుంబం కీలకంగా వ్యవహరించారు.

బ్రిటీష్ పాలనలోనే జాతరకు గుర్తింపు




గోపురాన్ని శంకుస్థాపన చేసిన వీవీఆర్‌కే యాచేంద్ర (ఫైల్)

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి పోలేరమ్మ జన జాతర విశిష్టతను బ్రిటీష్ పాలకులు గుర్తించినట్లు చరిత్రలో ఆధారాలు ఉన్నాయి. ఆ రోజుల్లో నూతన రైలు మార్గాల అన్వేషణలో భాగంగా బ్రిటీష్ అధికారి రిచర్డ్ ఎ రాబర్ట్ పర్యవేక్షణలో ఓ కమిటీ నియామకమైంది. ఈ కమిటీ మద్రాసు నుంచి కడప, చిట్వేల్, కోడూరు మీదుగా కృష్ణపట్నంకు రైలుమార్గం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించేందుకు పర్యటించింది. ఆ సమయంలో వెంకటగిరి జాతర ఆరంభమైంది. పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడం బ్రిటీష్ పాలకులు గుర్తించారు. అదే విషయాన్ని 1855లో హెచ్ స్మిత్ ఆధ్వర్యంలో మద్రాసులోని సెయింట్ జార్జి గెజిట్ ప్రెస్‌లో ముద్రించారు. 1953లో వెంకటగిరి రాజా కుమార రాజా వివివిఆర్‌కె యాచేంద్ర పోలేరమ్మ శీతలరాయికి నిర్మించి గోపురానికి శంకుస్థాపన చేసినట్లు చరిత్ర కారుడు అహ్మద్ తెలిపారు.

కైవల్యానది బ్రిడ్జివద్ద ఏర్పాటు చేసిన బయో టాయిలెట్స్



180 మందికి 24 బయో టాయిలెట్స్

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరలో 180 మంది పారిశుధ్య కార్మికులకు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచునున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలియజేశారు. వెంకటగిరి మున్సిపాలిటీలో 90 మంది సిబ్బంది ఉండగా నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, ఆత్మకూరు, నెల్లూరు మున్సిపాలిటీల నుంచి మరో 90 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. బయోటాయిలెట్స్ 24 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా 5 ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పట్టణం ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా దిశగా 5 ప్రత్యేక ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలిస్తున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా పట్టణ పరిధిలో అన్ని వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేశారు.



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు



అధినేతను కలిసిన నేదురుమల్లి



వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వెంకటగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజకీయ పరిస్థితులను అధినేతకు వివరించారు.

జాతర వేళ.. ఆర్టీసీ బస్సులు రద్దు

చిల్లకూరు: అనంతపురంలో ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వ బహిరంగ సభకు జనాలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను విని యోగించడంతో ప్రయాణికులు నానా అగచాట్లు పడ్డారు. ప్రతిష్టాత్మకమైన వెంకటగిరి పోలేరమ్మ జాతరకు వెళ్లేందుకు కూడా బస్సులు లేకపోవడంతో బుధవారం భక్తులు నానా అగచాట్లు పడ్డారు. బుధవారం ఆర్టీసీ బస్సులను వినియోగించడంతో గూడూరు డిపో నుంచి సుమారు 24 సర్వీసులు రద్దు చేశారు. ఈ విషయం తెలియక పోవడంతో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. ప్రయాణికులు డిపో అధికారులతో వాగ్వాదానికి దిగడంతో రద్దు చేసిన సర్వీసుల వివరాలను బోర్డు మీద రాసి పెట్టారు. అయినా జాతర వేళ బస్సులు రద్దు చేయడమేంటని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



నాయుడుపేట : అవస్థలు పడుతున్న ప్రయాణికులు

నాయుడుపేటటౌన్ : కూటమి ప్రభుత్వం అనంతపురంలో నిర్వహించిన విజయోత్సవ సభకు అధిక సంఖ్యలో సూళ్లూరుపేట, వాకాడు డిపోలకు సంబంధించిన ఆర్టీసీ బస్సులు తరలించారు. దీంతో రెండు రోజులుగా గ్రామాలకు వెళ్లేందుకు బస్సులు లేక ప్రమాణికులు నానా అగచాట్లు పడుతున్నారు. నిత్యం నాయుడుపేట ఆర్టీసీ ప్రాంగణం బస్సులతో కళకళలాడుతూ ఉండేది. అయితే బస్సులు రాకపోకలు లేకపోవడంతో బోసిపోయింది. అయితే ఆర్టీసీ ప్రాంగణం ప్రయాణికులతో కిటికిటలాడుతూ కనిపించింది. బస్సులు లేక ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు గాశారు. పలువురు ఆటోలు, క్యాబ్‌లు అద్దెకు తీసుకుని గమ్యస్థానాలకు తరలి వెళ్లారు.



బస్సులు లేక బోసిపోయిన ఆర్టీసీ బస్టాండు

ఉపకరణాల నిర్ధారణ శిబిరం

గూడూరురూరల్ : గూడూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఉప విద్యాశాఖాధికారి సనత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ గౌరీ శంకర్ ఆదేశాల మేరకు సహిత విద్య సమన్వయ కర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి 120 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎంఈఓలు రవీంద్రబాబు, రవూఫ్, ఏఎల్ఐఎంసీఓ వైద్య నిపుణులు ప్రియ, ఫిజియోథెరపిస్టు శివకుమార్, స్పెషల్ ఎడుకేటర్ జ్యోతిర్మయి, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధోరణి మారాలి

కోట: ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని బీఎస్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చోడవరం సుధాకర్ బుధవారం మీడియాకు తెలిపారు.

చికెన్ ధరలు		11-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	133
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	238
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	262
లేయర్ చికెన్	:	210



స్థానికులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



మాట్లాడుతున్న నెల్లూరు ఆర్డీఓ అనూష

సైదాపురం: స్థానికుల అభిప్రాయాల మేరకే మైనింగ్ లీజుకు అనుమతి మంజూరు చేసి, వారికి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషి అనూష వెల్లడించారు. మండలంలోని ఊటుకూరు సమీపంలోని బుధవారం వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీ ఆధ్వర్యంలో పర్యావరణపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఊటుకూరు గ్రామంలోని 359–1లో 24.476 హెక్టార్లలో మైనింగ్ కార్యకలాపాలను నిర్వహించేందుకు పర్యావరణ అనుమతి కోసం ఈ ప్రజాభిప్రాయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. పర్యావరణాన్ని కాపాడుకుని పరిశ్రమలు అభివృద్ధి సాధించాలని ఆమె కోరారు. లీజు విషయమై పలువురు ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ అధికారి అశోక్‌కుమార్, తహసీల్దార్ సుభద్ర, పలు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు విజయవంతం



మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట నియోజవర్గ కేంద్రంలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతమైనట్లు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. ఆయన బుధవారం నాయుడుపేట క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. పోలీసులు ఎన్ని అవరోధాలు పెట్టినా రైతులు, ప్రజలు నాయకులు పాల్గొని విజయవంతం చేశారని సంజీవయ్య ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జ్ఞానపీఠ్ తొలి అవార్డు గ్రహీతకు ఘన నివాళి

చిల్లకూరు: తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ జయంతి సందర్భంగా పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు ప్రజేంద్రరెడ్డి మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అనసూయ, నాగభూషణమ్మ, రవీంద్ర, మహిళా పోలీస్ వసుంధర పాల్గొన్నారు.



























క్లుప్తంగా

13న బాక్సింగ్, లాన్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు జెడ్పీ హైస్కూల్, తిరుపతి బైరాగిపట్టెడలోని ప్రోయేస్ టెన్నిస్ అకాడమీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో బాక్సింగ్, లాన్ టెన్నిస్ ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. బుధవారం ఈ మేరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కిషోర్‌కుమార్, మహిళా కార్యదర్శి ఎల్.భార్గవి తెలిపారు. అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. పోటీలకు హాజరయ్యే వారు సొంత క్రీడా సామగ్రిని వెంట తెచ్చుకోవాలని, అలాగే వయసు ధ్రువీకరణపత్రం, ఇంటర్ విద్యార్థులు పదో తరగతి ఒరిజినల్ మార్కులు జాబితా తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు బాక్సింగ్‌కు సంబంధించి 98491 59147, 94418 91874, అలాగే లాన్ టెన్నిస్‌కు సంబంధించి 97007 78867నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మిలటరీ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి సిటీ : రాష్ట్రీయ మిలటరీ స్కూళ్లలో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు అక్టోబర్ 9వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇతర వివరాలకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ స్కూల్, లేదా 86888 88802 / 93999 76999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఐటీలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్ : ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని, ఈ క్రమంలోనే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రవేశపెట్టారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం పద్మావతి మహిళా వర్సిటీలోని ధృతి ఆడిటోరియంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్–2025 సెమీఫైనల్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా వర్సిటీలో హ్యాకథాన్ సెమీస్ చేపట్టడం శుభపరిణామమన్నారు. ఐటీ నిపుణులుగా ఇతర దేశాల్లో స్థిరపడిన మన వాళ్లు తమ మేధస్సును స్వదేశంలో ఉపయోగిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని వెల్లడించారు. వర్సిటీ వీసీ వి.ఉమ, రిజిస్ట్రార్ రజని, ఎస్ఎస్ఐఐఈ సీఈఓ సూర్యకుమార్, ప్రొఫెసర్ వాణి పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు.. ప్రజాస్వామ్యానికి ప్రమాదం



విజయసింహారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్, చిత్తూరు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం. ఇలాంటి విధానాల వల్ల సమన్యాయం, అభివృద్ధి, రాజ్యాంగ విలువల పరిరక్షణ ఆందోళనకరంగా మారుతుంది. పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, భద్రత లాంటివి రేపటి సమ సమాజ స్థాపనకు ఊతమిచ్చే విధంగా ప్రభుత్వం ఉండాలే కానీ, గొంతు నొక్కేలా వ్యవహరించకూడదు. అలా నిజాల్ని మరుగున పరిచే విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తు తరం పాలకవర్గాలను క్షమించదన్న విషయం గమనించుకోవాలి. పత్రికా స్వేచ్ఛ మీద న్యాయస్థానాల్లో ఎన్నో ల్యాండ్ మార్క్ జడ్జిమెంట్లు ఉన్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాశాడనే కారణంగా జర్నలిస్టు మీద క్రిమినల్ కేసులు పెట్టవద్దని గతంలోకి లక్నోకి చెందిన కేసులో సుప్రీం కోర్టు చాలా విస్పష్టమైన ఆదేశాలిస్తూ పత్రిక స్వేచ్ఛ పట్ల సంచలన వ్యాఖ్యలు చేసింది. అసలు భారతదేశంలో పత్రికలకు ఉన్న రాజ్యాంగపరమైన హక్కుల గురించి స్పష్టంగా తెలుసుకుంటే జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించాలనే ప్రయత్నాలు చేయరు.



కక్ష సాధింపులకు మూల్యం చెల్లించుకోక తప్పదు



మునిరామిరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు, తిరుపతి

రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యేలా కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తోంది. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా వ్యవహరించడం దారుణం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పత్రికల్లో వార్తలు వస్తే తమకు మింగుడుపడని పక్షంలో ఖండించాలి తప్ప కక్ష సాధింపు చర్యలకు దిగడంతో ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుంది. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయించి నోటీసులు జారీచేయడం మేధావి వర్గాలు, జర్నలిస్టులు ఆలోచించాల్సిన విషయం. వ్యవస్థలను తమ చేతులోకి తీసుకుని ఇష్టానుసారంగా పాలన కొనసాగిస్తే అందుకు తగిన మూల్యం భారీ స్థాయిలో చెల్లించుకోక తప్పదు. ప్రజలు హర్షించే విధంగా ప్రభుత్వ పాలన కొనసాగాలి కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అలాంటి పరిస్థితులు కనబడలేదు. ఇకనైనా పత్రికల యాజమాన్యాలపైన, జర్నలిస్టులపైనా కేసులు పెట్టే సంస్కృతి మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వ దృష్టి సారించాలి

వైన్‌షాప్ పెడితే సహించం!

"ఇక్కడ కాలేజీ పిల్లలున్నారు.. హాస్టళ్లున్నాయ్.. నిత్యం కూలి పనులకు వెళ్లి చీకటి పడిన తర్వాత ఇంటికి చేరుకునే మహిళలు ఈ రోడ్డులోనే నడిచి వస్తుంటారు.. మందుబాబుల కారణంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.. నివాసాల నడుమ మద్యం దుకాణం పెట్టడం ఎంత వరకు న్యాయం.. ఇక్కడ వైన్‌షాపు పెట్టేందుకు ఏమాత్రం ఒప్పుకోం.. చేతులెత్తి మొక్కుతున్నాం.. మా అవస్థలను గుర్తించి కనికరించండి.. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాం.. ప్రభుత్వాన్ని కదిలించే వరకు పోరాటం సాగిస్తాం" అంటూ తిరుపతి రూరల్ మండలం శ్రీనగర్ కాలనీ, గాంధీపురం మహిళలు మండిపడ్డారు.



మద్యం దుకాణం ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో ఆందోళన చేస్తున్న మహిళలు

- గతంలో 'బార్'లా తెరిచేశారు
- ఇప్పుడు మద్యం దుకాణానికి అనుమతులిచ్చారు
- ఇక్కడ పిల్లలు ఉన్నారు.. పర్మిషన్ రద్దు చేయండి
- రోడ్డెక్కిన శ్రీనగర్ కాలనీ, గాంధీపురం మహిళలు

తిరుపతి రూరల్ : మండలంలోని గాంధీపురం గ్రామానికి చెందిన మహిళలతో పాటు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని శ్రీనగర్ కాలనీ వాసులు బుధవారం రోడ్డెక్కారు. తమ ప్రాంతంలో వైన్‌షాపును ఏర్పాటు చేయవద్దని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో బార్ పెట్టొద్దని గతంలో పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. కాపురాలున్న చోట మందుబాబులను అర్ధరాత్రి వరకు కూర్చోబెట్టి తాగించడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు సైతం నానా అవస్థలు పడేవాళ్లమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బార్ మూసేశారని, హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటూ ఉంటే, ఇంతలోనే అదే చోట వైన్‌షాపు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. కాలేజీలు, పాఠశాలలకు పిల్లలను పంపించాలంటే ఈ మద్యం దుకాణం ముందు నిలబడి విద్యాసంస్థల బస్సులు ఎక్కించాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వానికి డబ్బులే కావాలనుకుంటే మరోచోట మద్యం దుకాణం పెట్టించుకోవాలని, ఇళ్ల మధ్య ఏర్పాటు చేస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

అడ్డుకుంటాం

గతంలో బార్ పెట్టినపుడు నిరసనను వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఎన్ని పోరాటాలు చేసినా బార్‌ను మూసివేయించలేకపోయాం. ఇప్పుడు గత నాలుగు రోజులుగా బార్ మూత వేశారు. బార్ లేకపోవడంతో ప్రశాంతంగా ఉంది. రెండు రోజుల్లో మద్యం దుకాణం పెడతామని చెబుతున్నారు. వైన్‌షాప్ పెడితే కచ్చితంగా అడ్డుకుంటాం. ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నా చేస్తాం.

– యశోద, గాంధీపురం

డీవీ సత్రంలో క్రీడా పోటీలు ప్రారంభం

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం 69వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను స్థానిక ఎంఈఓ కొండయ్య ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు డీవీ సత్రంలోని గురుకులం, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నరసింహారావు, మండల కో–ఆర్డినేటర్ రమణయ్య, పీఈటీలు శ్రీనివాసులు, లలిత, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి-షిరిడీకి రెగ్యులర్‌గా రైళ్లు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుపతి– షిరిడీ రైళ్లను నిత్యం నడిపేందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తిరుపతి– షిరిడీ మార్గంలో తొమ్మిది సర్వీసుల చొప్పున మొత్తం 18 ప్రత్యేక రైళ్లను ఇటీవల ప్రారంభించారు. ఈ నెలాఖరు వరకూ ఈ ప్రత్యేక రైలు సర్వీసులు నడుస్తాయి. ఆయా సర్వీసులను రెగ్యులర్‌గా వెళ్లే ఈ రైళ్లను రేణిగుంట జంక్షన్, ధర్మవరం, రాయచూర్, షోలాపూర్, దోండ్ స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగించే దిశగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

డిగ్రీ ప్రవేశాలపై అయోమయం

తిరుపతి సిటీ : డిగ్రీ ప్రవేశాలపై ఉన్నత విద్యా మండలి తీరుతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. సీట్ల కేటాయింపు జాబితాను ఆదివారం విడుదల చేస్తామని ప్రకటించిన అధికారులు సాంకేతిక లోపాలతో సోమవారం, మంగళవారం, బుధవారం అంటూ ఇప్పటికే మూడు సార్లు వాయిదా వేశారు. బుధవారం అర్ధరాత్రి వరకు వేచి చూసినప్పటికీ సీట్ ఎలాట్‌మెంట్ మెసేజ్ రాకపోవడంతో నిరాశ చెందారు. తమ జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు

తిరుపతి అర్బన్ : జిల్లాలోని చెరువుల అభివృద్ధి పనులకు సంబంధించి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 181 చెరువుల పరిధిలో 30,081 హెక్టర్లు సాగు భూమి ఉందన్నారు. ఈ చెరువుల అభివృద్ధికి రూ.515 కోట్ల మేర ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చెరువులను బలోపేతం చేయాలని కోరారు. ఇరిగేషన్ తిరుపతి ఎస్ఈ రాధాకృష్ణ, చిత్తూరు ఎస్ఈ వెంకటేశ్వరరాజు, నెల్లూరు ఎస్ఈ దేశినాయక్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, భూగర్భజలవనరులశాఖ డీడీ శోభన బాబు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఆరోగ్య లక్ష్యాల సాధనకు కృషి

జాతీయ ఆరోగ్య లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యబృందంతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేస్తేనే గ్రామీణులకు వైద్యులపై నమ్మకం కలుగుతుందని చెప్పారు. ఆరోగ్య కేంద్రాల్లో పకడ్బందీగా వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, వైద్యాధికారులు శైలజ, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, శాంతకుమారి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఏరులై పారిన మద్యం

వెంకటగిరి(సైదాపురం): అనాదిగా వస్తున్న జాతర సంప్రదాయాలను కూటమి నేతలు తుంగలో తొక్కుతున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అమ్మవారి జాతరలో బుధ, గురువారాల్లో 48 గంటల పాటు మద్యంషాపులను పూర్తిగా అధికారికంగా మూయించడం ఆనవాయితీ. అయితే బుధవారం వెంకటగిరిలో అన్ని మద్యం షాపులు బార్లా తెరిచి మద్యం విక్రయించడం గమనార్హం. ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణన మాట్లాడుతూ తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఏడాది బుధవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు మాత్రమే మద్యంషాపులను మూసివేస్తున్నట్లు తెలియజేశారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

తిరుపతి క్రైమ్ : తిరుపతిలోని వేర్వేరు చోట్ల బుధవారం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. వివరాలు.. గ్రూప్ థియేటర్ వద్ద 35 నుంచి 40 ఏళ్ల వ్యక్తి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే రుయా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అలాగే రుయా ఆస్పత్రి ప్రాంగణంలో సుమారు 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జన బాహుళ్యంలోకి హరికథ

తిరుపతి అన్నమయ్యసర్కిల్: శ్రీవారి వైభవంలో ముఖ్య పాత్ర పోషించిన హరికథను జన బాహుళ్యంలోకి తీసుకెళ్లాలని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ తెలిపారు. శ్వేత భవనంలో పది రోజులుగా నిర్వహిస్తున్న హరికథా వైభవం శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నాట్యకళల మేళవింపే హరికథ కళారూపమని వెల్లడించారు. అదనపు కార్యదర్శి రామ్‌గోపాల్ మాట్లాడుతూ ఆదిభట్ల నారాయణదాసు గొప్ప కళారూపమైన హరికథకు ఆద్యుడిగా నిలిచారని కొనియాడారు. అనంతరం శిక్షణపొందిన 30 మంది మహిళా హరిదాసులకు సర్టిఫికెట్లు అందించారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై డీపీవో పరిశీలన

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు గ్రామంలో పారిశుధ్య పనులపై బుధవారం డీపీవో సుశీల, ఎంపీడీవో ప్రమీలారాణి పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో శిరసనంబేడు గ్రామం జిల్లాలో చివరి మూడవ స్థానంలో ఉండడం వల్ల నివాసాల మధ్య పేరుకుపోయిన మురుగు నిల్వలు, మురుగు కాలువల్లో చేరిన చెత్త, చెదారాలు తదితర అంశాలపై ఆరా తీశారు. అక్కడ పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి బదిలీపై వెళ్లడంతో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టే అవకాశం లేదని గుర్తించారు. త్వరలో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి మురుగునిల్వలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గానికి సూచించారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న క్షేత్రస్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు అందజేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పెంచలయ్య, గ్రామస్తులు హరిబాబురెడ్డి, కళ్యాణ్‌రెడ్డి పాల్గొన్నారు.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న డీపీవో

కాలేజీ ఫీజు కట్టకుండా.. జల్సాలకు ఖర్చు పెట్టి!

- తల్లిదండ్రులకు తెలియడంతో మనస్తాపం
- గూడ్సు కింద పడి బీటెక్ విద్యార్థి బలవన్మరణం



జగదీశ్వరరెడ్డి (ఫైల్)

జూపాడు బంగ్లా: కుమారుడు బాగా చదివి ప్రయోజకుడు అవుతాడన్న ఆ తల్లిదండ్రుల కల చివరకు విషాదాంతమైంది. చెడు సావాసం చివరకు ఆ యువకుడి ప్రాణాలను బలితీసుకుంది. కళాశాల ఫీజు జల్సాలకు ఖర్చు పెట్టిన బీటెక్ విద్యార్థి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నంద్యాల జిల్లాలోని తర్తూరు గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి, ఉషారాణి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు జగదీశ్వరరెడ్డి (20) తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్య అభ్యసిస్తున్నాడు. తృతీయ ఏడాదిలోకి వచ్చే సరికి చెడు వ్యవసనాలకు అలవర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం ఇంటికి వచ్చిన కొడుకుతో ఫీజు ఇచ్చి పంపించాడు. అయితే ఫీజు కట్టలేదని కళాశాల నుంచి ఫోన్ రావడంతో తల్లిదండ్రులు హుటాహుటిన తిరుపతికి వెళ్లి కుమారుడిని విచారించారు. అయితే ఫీజు డబ్బులు ఖర్చు అయ్యాయని చెప్పినా.. వారు కుమారుడిని ఏమనకుండా త్వరలో ఫీజు చెల్లిద్దామని నచ్చజెప్పారు. తమతో పాటు ఊరికి రావాలని చెప్పగా.. 'పని ఉంది మీరు వెళ్లండి నేను వెనుకాలే వస్తా' అంటూ చెప్పడంతో వారు మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. కాగా కుమారుడు ఇంకా రాకపోవడంతో ఆందోళన చెందుతుండగా తమ కుమారుడు ఇక లేడని సమాచారం అందింది. బుధవారం నంద్యాల రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఓజిలి వైస్ ఎంపీపీకి పితృ వియోగం





లెక్కల పెద్ద మస్తాన్ నాయుడు (ఫైల్), నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: మండల పరిధిలోని సగుటూరు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ (ఎంపీటీసీ సభ్యుడు) లెక్కల ప్రసాద్‌నాయుడుకు పితృవియోగం కలిగింది. ప్రసాద్‌నాయుడి తండ్రి లెక్కల పెద్ద మస్తాన్ నాయుడు(75) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. పార్టీ నాయకులతో సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వారింటికి వెళ్లి మస్తాన్‌నాయుడి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయన వెంట ఎంపీపీ అరుణారెడ్డి, మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బెల్లం సుబ్బానాయుడు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీలు పరామర్శించిన వారిలో ఉన్నారు.

యువకుడి దారుణ హత్య



రహీద్ మృతదేహం

గూడూరురూరల్ : పట్టణంలోని గాంధీనగర్ శ్మశాన వాటిక సమీపంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన బుధవారం ఉదయం వెలుగుచూసింది. వివరాలు.. స్థానిక టిడ్కో ఇళ్లలో నివాసముండే షేక్ రహీద్(35) కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన రహీద్ బుధవారం ఉదయం రోడ్డు పక్కన మృతదేహంగా కనిపించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కత్తిపోట్ల కారణంగా రహీద్ మరణించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ గీతా కుమారి ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ శ్రీనివాస్, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలోనే మృతుడి కుటుంబీకులు, బంధువులు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రాణాలు కాపాడిన ఎయిర్ బ్యాగ్

రేణిగుంట: మండలంలోని గాజుల మండ్యం కాలనీ సమీపంలో తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో కారులోని ఎయిర్ బ్యాగ్ సకాలంలో ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. నగరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దినేష్ బుధవారం ఉదయం తిరుపతి నుంచి నగరికి భార్య పిల్లలతో కలిసి కారులో బయలుదేరారు. మార్గం మధ్యలో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొంది. ఇంతలో కారులోని ఎయిర్ బ్యాగ్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. దినేష్‌కు, అతడి భార్యకు గాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారుని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం సంయుక్త కార్యదర్శిగా వెంకటేష్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం సంయుక్త కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన టి.వెంకటేష్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసింది.

మహిళకు గాయాలు

రేణిగుంట : మండలంలోని ఎల్లమండ్యం దళితవాడలో బుధవారం ఆస్తి కోసం జరిగిన ఘర్షణలో ఓ మహిళకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని బంధువులైన అంకమ్మ, బత్తెయ్య మధ్య ఆస్తి తగాదాలున్నాయి. ఈ క్రమంలో బత్తెయ్య కోపం పట్టలేక అంకమ్మపై దాడికి దిగారు. దీంతో బాధితురాలి మెడపై రక్తగాయమైంది. ఆమెను వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.